**3** ఇంగ్లండులో చేసిన ఓ పరిశోధనలో ఫ్యామిలీ డాక్టర్ల మీద ఆధారపడేవారిలో అప్పటికప్పుడు హాస్పిటల్లో అడ్మిట్ అయ్యే ప్రమాదం తక్కువని తేలింది. తమ ఆరోగ్యాన్ని తరచూ పర్యవేక్షించుకునే అవకాశం, వ్యాధులు తొలిదశలోనే ఉన్నప్పుడు వాటికి చికిత్స తీసుకోవడమే ఇందుకు కారణం.

---

**4** ప్రతీ పరిశోధనా ఫ్యామిలీ డాక్టర్లకు అనుకూలంగా ఉంది అనడానికి లేదు. ఉదాహరణకు కార్డిఫ్ విశ్వవిద్యాయం పరిశోధకులు సేకరించిన వివరాల్లో పంటినొప్పి తగ్గడానికని ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి వెళ్లినవారికి శాశ్వత పరిష్కారం సూచించకుండా యాంటీబయాటిక్స్ ఇవ్వడం వల్ల వారి శరీరం ఆ మందులకు అలవాటుపడిపోయిన సందర్భాలు కనిపించాయి. ప్రతి నొప్పికీ మందే కాదు, ఇతర 'స్పెషలిస్ట్' చికిత్సలు కూడా అవసరం పడతాయనే విషయాన్ని ఇది సూచిస్తుంది.



# ఎలాంటి వ్యక్తిని ఎంచుకోవాలి?



- చాలాసార్లు మనం సంప్రదించే వైద్యుడి అర్హతను గమనించుకోం. తను ఆర్ఎంపీ లాంటి కోర్సులు చేశాడా లేదా ఎంబీబీఎస్ పట్టా తీసుకున్నాడా లేదా అని గమనించుకోవాలి. అవసరమైతే తన రిజిస్టర్డ్ నెంబరుని www.nmc.org.in లాంటి వెబ్‌సైట్ల ద్వారా నిర్మొహమాటంగా పరీక్షించుకోవచ్చు. దేశంలో పదిలక్షల మంది నకిలీ వైద్యులున్నారనే గణాంకాలు వింటే, ఈ తరహా జాగ్రత్త ఎంత అవసరమో అర్థమవుతుంది.
- ప్రతి వైద్యుడికీ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఏదన్నా సర్టిఫికెట్ కోర్సు చేయడం ద్వారానో, ఓ హాస్పిటల్లో పనిచేయడం వల్లో, ప్రత్యేక ఆసక్తితోనో వాళ్లు కొన్ని అంశాల మీద పట్టు సాధిస్తారు. పిల్లల వైద్యం, మధుమేహం, జ్వరాలు, రక్తపోటు... ఇలా ఏదో ఓ నేర్పు ఉండవచ్చు. ప్రత్యేకమైన అవసరాలు ఉన్నవారు అందుకు అనుగుణమైన వైద్యులను ఎంచుకోవాలి.
- వైద్యుడు మనకు దగ్గరలో ఉన్నారా? అప్పుడప్పుడూ కాకుండా ప్రత్యేకమైన క్లినిక్‌లో తగినంత సమయాన్ని కేటాయిస్తుంటారా? తరచూ టూర్ల మీద వెళ్లకుండా అందుబాటులో ఉంటారా? ఫోన్‌కి స్పందిస్తారా? లాంటి అంశాలనూ గమనించుకోవాలి. లేకపోతే నిజంగా తన సలహా, సంప్రదింపు అవసరం అయినప్పుడు అవి దొరక్కపోతే కష్టం.
- ఓ వైద్యుడి దగ్గరికి మొదటిసారి వెళ్లినప్పుడు మన ఆరోగ్య చరిత్రను క్షుణ్నంగా వింటున్నారా? ఏదన్నా సమస్యను చెప్పినప్పుడు దాని కారణాలనీ, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులనీ సూచిస్తున్నారా లేకపోతే మందు రాసి పంపేస్తున్నారా? పెడసరంగా కాకుండా ధైర్యాన్నిచ్చేలా మాట్లాడుతున్నారా? మందులు, టెస్టులు రాసినప్పుడు వాటి వెనుక కారణాలు వివరిస్తున్నారా? లాంటి అంశాలన్నీ ఓ వైద్యుడి మీద నమ్మకాన్ని నిర్ధారిస్తాయి.
- ఈసీజీ, మధుమేహ పరీక్ష లాంటి మౌలిక పరికరాలతో పాటు అవసరమైతే కాసేపు చికిత్స చేసి (ఉదా|| సెలైన్ ఎక్కించడం, కుట్లు వేయడం) పంపేందుకు అవసరమయ్యే వసతి ఉందో లేదో గమనించుకోవాలి. ఈ చికిత్సలకు బీమా సౌకర్యం ఉంటే మరీ మంచిది.
- ఒక డాక్టర్‌తో కాసేపు గడిపితే తను ఎంతవరకు 'కమర్షియల్' అన్నది అర్థమైపోతుంది. కాస్త మానవతా దృక్పథం ఉన్న వైద్యులను ఎంచుకోవడం వల్ల వారితో మానసిక, ఆర్థిక అనుబంధాలు మెరుగ్గా ఉంటాయి.

**మన స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 2.1 శాతం మాత్రమే బడ్జెట్లో వైద్య రంగం కోసం కేటాయించినట్టు తెలుస్తుంది. దీన్నిబట్టి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందాల్సిన అగత్యం ఉంది. అందుకు ఒకటే జవాబు! కుటుంబ వైద్యుడు. తను అండగా లేకపోతే దేశంలోని మధ్య, దిగువ తరగతి ప్రజల ఆరోగ్యం గాల్లో దీపంగా మారిపోతుంది. ఇప్పటికీ అయిదురూపాయల డాక్టరు, పదిరూపాయల డాక్టరు అంటూ నామమాత్రపు ఖర్చుతో చికిత్స చేసే వైద్యుల గురించి గొప్పగా చెప్పకొంటున్నాం అంటే కారణం... మానవతా దృక్పథం ఉన్న వైద్యుల పట్ల మనకు ఉన్న అభిమానమే. అలాంటి వైద్యులకు అండగా నిలిచే ఫ్యామిలీ డాక్టర్ రంగాన్ని ఆదరించి, నిలబెట్టడం మన చేతుల్లో కూడా ఉంది.**